క్లుప్తంగా

మెరుగైన కంటి చూపే ప్రభుత్వ లక్ష్యం



పామర్రు: ప్రతి ఒక్కరికీ మెరుగైన కంటి చూపు అందించడమే సీఎం జగన్‌మోహన్ రెడ్డి ప్రభుత్వ లక్ష్యమని పామర్రు వైస్ ఎంపీపీ ఆరేపల్లి శ్రీనివాసరావు అన్నారు. స్థానిక ఐదో సెగ్మెంట్‌లోని బాపూజీపేట 20వ వార్డులో గురువారం ప్రభుత్వం ఆధ్వర్యాన కంటి వెలుగు కార్యక్రమం నిర్వహించారు. శ్రీనివాసరావు మాట్లాడుతూ అవసరమైన వారికి కంటి ఆపరేషన్లను కూడా ఉచితంగా చేస్తున్నారని చెప్పారు. కళ్లజోళ్లను ఉచితంగా అందిస్తారన్నారు. సుమారు 100 మందికిపైగా ఉచిత కంటి పరీక్షలు చేయించుకున్నారు. వీరిలో 10 మందికి ఆపరేషన్ అవసరమని, 20 మంది కళ్లజోళ్లు కావాలని గుర్తించారని తెలిపారు. కార్యక్రమంలో ఏఎన్‌ఎంలు, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

కమ్యూనిటీ హాళ్ల నిర్మాణానికి ప్రాధాన్యం



కైకలూరు: కమ్యూనిటీ హాళ్ల నిర్మాణాలకు ప్రాధాన్యమిస్తున్నామని ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు (డీఎన్నార్) అన్నారు. జిల్లా పరిషత్ నిధులు రూ.10 లక్షలు, మండల పరిషత్ నిధులు రూ.5 లక్షలు, ఎంపీ లాడ్స్ నిధులు రూ.5 లక్షలు, పంచాయతీ నిధులు రూ.2 లక్షలు కలిపి మొత్తం రూ.22 లక్షలు, ప్రజా విరాళాలతో ఆటపాక పాత రామాలయం సమీపంలో నిర్మిస్తున్న కమ్యూనిటీ హాలు పనులను ఎమ్మెల్యే గురువారం పరిశీలించారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు కన్నా రమేష్, సింగంశెట్టి రాము పాల్గొన్నారు.

ప్రభుత్వ పథకాలపై అవగాహన

మండవల్లి: పీఎం జీవన్‌జ్యోతి బీమా యోజన, సురక్ష బీమా యోజన వంటి ప్రభుత్వ పథకాలతో కుటుంబ భవిష్యత్తు మార్చుకోవచ్చని ఇండియన్ బ్యాంక్ మేనేజర్ బొంతు దుర్గారావు అన్నారు. తక్కెళ్లపాడు సచివాలయంలో గురువారం పీఎం జేజేవై సురక్ష బీమా యోజన తదితర ప్రభుత్వ పథకాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. వీటిలో చేరి ఏడాదికి రూ.456 చెల్లించి సంవత్సరానికి రూ.2 లక్షలు, అనూహ్యమైన సంఘటనలు జరిగితే మరో రెండు లక్షలు జీవిత బీమా వర్తింపుతో రక్షణ కలుగుతుందని పేర్కొన్నారు. బ్యాంక్ మిత్ర ఇంటి ఝాన్సీ, కార్యదర్శి ఎం.కొండలు, వెల్ఫేర్ అసిస్టెంట్ అనిల్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

రసాయన ఎరువుల వాడకాన్ని తగ్గించాలి

కైకలూరు (కలిదిండి): పంటలో రసాయన ఎరువుల వాడకాన్ని తగ్గించాలని కైకలూరు వ్యవసాయ సహాయ సంచాలకుడు గంగాధరరావు రైతులకు సూచించారు. కోరుకొల్లులో ఏలూరు జిల్లా వ్యవసాయ సాధికారత సంస్థ ఆధ్వర్యంలో గురువారం ప్రకృతి వ్యవసాయం, 2024 ఖరీఫ్ ప్రణాళికపై రైతులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఏడీఏ మాట్లాడుతూ అధిక మోతాదులో ఎరువులు వాడితే మనుషులపై ప్రభావం చూపుతుందని తెలిపారు. విత్తనశుద్ధిని అందరూ పాటించాలని సూచించారు. జిల్లా వనరుల కేంద్రం సహాయ వ్యవసాయ సంచాలకులు టి.లలితా సుధ మాట్లాడుతూ పచ్చిరొట్ట పైరులు జీలుగ, పిల్లి పెసర వేసుకోవడంతో భూమి సారవంతమవుతుందని చెప్పారు. అనంతరం వ్యవసాయాధికారులు క్షేత్ర స్థాయిలో పచ్చిరొట్ట పైరును పరిశీలించారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి కె.విద్యాసాగర్, వీఏఏలు స్టీఫెన్, అప్పారావు, రైతులు గంగుల ఆంజనేయులు, చలమలశెట్టి బసవయ్య, వలవల రాజారావు పాల్గొన్నారు.

ఆధ్యాత్మిక చింతన అలవర్చుకోవాలి

పామర్రు: ప్రతి ఒక్కరూ ఆధ్యాత్మిక చింతన అలవర్చుకోవాలని పామర్రు ఎమ్మెల్యే కైలే అనిల్‌కుమార్ అన్నారు. స్థానిక తోటలోని శ్రీ కోదండ రామాలయంలో శిఖర, ధ్వజ స్తంభ ప్రతిష్ఠ కార్యక్రమాలు గురువారం వైభవంగా నిర్వహించారు. తొలుత ఆలయ అర్చకులు వేదాంతం ఠాగూర్ శ్రీనివాస్ ఎమ్మెల్యేకు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. ఎమ్మెల్యే అనిల్‌కుమార్ మాట్లాడుతూ ఆధ్యాత్మిక కేంద్రాలైన ఆలయాలను కాపాడుకోవాలన్నారు. స్వామివార్లకు ప్రత్యేక పూజలు చేశారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

రూ.1,00,116 విరాళం

ఆలయ అభివృద్ధికి ఎమ్మెల్యే అనిల్‌కుమార్ రూ.1,00,116 విరాళాన్ని ఇచ్చి దాతృత్వాన్ని చాటుకున్నారు. ప్రతిష్ఠా మహోత్సవం అనంతరం అన్న సమారాధనను ప్రారంభించారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు బాల వెంకటేశ్వరరెడ్డి, మధురెడ్డి, డి.డి. ప్రసాద్, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.



ఆలయ అభివృద్ధికి రూ.1,00,116 చెక్కును ఆలయ సభ్యులకు అందజేస్తున్న ఎమ్మెల్యే అనిల్‌కుమార్

ముదినేపల్లి రూరల్: మండలంలోని కొరగుంటపాలెంలో విజయగణపతిస్వామి ఆలయ నిర్మాణానికి స్థానిక ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు (డీఎన్నార్) గురువారం భూమి పూజ చేశారు. ఆలయ నిర్మాణాన్ని టీటీడీ మంజూరు చేసిన నిధులతో చేపట్టారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో హిందూ మత ప్రచారాల నిమిత్తం ఆలయాల నిర్మాణానికి టీటీడీ నిధులు మంజూరు చేస్తుండటం హర్షణీయమన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ రామిశెట్టి సత్యనారాయణ, సర్పంచ్ పేరే రామకృష్ణ, సొసైటీ అధ్యక్షుడు అచ్యుత రాంబాబు, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ మండల శాఖ అధ్యక్షుడు మోట్రు ఏసుబాబు, నాయకులు పాము రవికుమార్, బోనం శేషగిరారవు, కోమటి విష్ణువర్ధన్ తదితరులు పాల్గొన్నారు.



ఎమ్మెల్యే డీఎన్నార్‌కు శ్రీసుబ్రహ్మణ్యేశ్వరస్వామి చిత్రపటం అందజేస్తున్న ఆలయ కమిటీ చైర్మన్

సుబ్రహ్మణ్యేశ్వరుని సన్నిధిలో..

సింగరాయపాలెం-చేవూరుపాలెం సెంటర్లోని శ్రీసుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయంలో ఎమ్మెల్యే స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ చైర్మన్ శొంఠి నాగరాజు, ప్రధాన అర్చకుడు తోలేటి వీరభద్రశర్మ ఆధ్వర్యంలో ఎమ్మెల్యేకు స్వాగతం పలికారు. ఎమ్మెల్యేకు స్వామివారి చిత్రపటం, ప్రసాదాలు అందజేశారు. నరసింహారావు, ఆనందదాసు సత్యనారాయణ, గణేషులు సురేష్, ఆనందదాసు శివయ్య పాల్గొన్నారు.

నేడు డయల్ యువర్ డీఎం

గుడివాడ టౌన్: ఆర్టీసీ ప్రయాణికుల సమస్యలు తెలిపేందుకు ఆర్టీసీ అభివృద్ధికి సలహాలు, సూచనలు ఇవ్వడానికి శుక్రవారం డయల్ యువర్ డీఎం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు డిపో మేనేజర్ రాజేష్‌కుమార్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 11.30 నుంచి 12.30 గంటల వరకు కార్యక్రమం జరుగుతుందని ఆసక్తి ఉన్నవారు 99592 25464కు డయల్ చేయాలని కోరారు.

200 మందికి ఉచిత వైద్య పరీక్షలు

గుడివాడ టౌన్: తారకరామా వాకర్స్ క్లబ్ ఆధ్వర్యాన గురువారం ఉచిత వైద్యశిబిరం జరిగింది. స్టార్ ఫార్మసీ సౌజన్యంతో 200 మందికి పరీక్షలు చేసి ఉచితంగా మందుల పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఫార్మసీ అధినేత శివరామ్, టెక్నీషియన్ కీర్తి, క్లబ్ అధ్యక్షుడు సయ్యద్ మహ్మద్ అలి, కార్యదర్శి ఎం.బలరామ్ తదితరులు పాల్గొన్నారు.

రైతులకు మెరుగైన సేవలు అందించండి

జిల్లా వ్యవసాయశాఖ అధికారి విజయభారతి

గుడివాడరూరల్: వ్యవసాయశాఖ ద్వారా రైతులకు మెరుగైన సేవలు అందించాలని జిల్లా వ్యవసాయశాఖ అధికారి ఎం.విజయభారతి పేర్కొన్నారు. స్థానిక వ్యవసాయశాఖ ఏడీఏ కార్యాలయంలో గురువారం గుడివాడ, పెదపారుపూడి, నందివాడ మండలాల వ్యవసాయశాఖ అధికారులు, సిబ్బందితో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ రైతులకు అందిస్తున్న ప్రభుత్వ పథకాలపై అధికారులు బాధ్యతగా వ్యవహరించాలన్నారు. పీఎం కిసాన్ లబ్ధిదారులతో నూరు శాతం ఈకేవైసీ చేయించాలని చెప్పారు. ఎరువులకు ముందుగానే ఆర్‌బీకే కేంద్రాల్లో పొజిషన్ చేయాలన్నారు. పచ్చిరొట్ట విత్తనాలను రైతులకు అందరికీ సబ్సిడీపై పంపిణీ చేయాలన్నారు. వచ్చే ఖరీఫ్ సీజన్‌లో పంటల నమోదుకు ముందుగానే రికార్డులు సరి చూసుకోవాలని సూచించారు. సిబ్బంది.. రైతులతో మమేకమై సహకరించాలని చెప్పారు. సమావేశంలో వ్యవసాయశాఖ డీడీఏ మనోహర్, ఏడీఏ రమాదేవి, వ్యవసాయశాఖ అధికారులు బి.అనంతలక్ష్మి, త్రినాధ ఆంజనేయరావు, శ్రీధర్, ఏఓ ప్రియాంక, వ్యవసాయశాఖ సిబ్బంది పాల్గొన్నారు.

జీలుగ విత్తనాల పంపిణీ

ప్రభుత్వం రైతులకు భూమిని సారవంతం చేసేందుకు ఉచితంగా ఇచ్చే జీలుగ విత్తనాలను జిల్లా వ్యవసాయశాఖ అధికారి విజయభారతి బొమ్ములూరు రైతుభరోసా కేంద్రం వద్ద గురువారం పంపిణీ చేశారు. మండల వ్యవసాయశాఖ అధికారి అనంతలక్ష్మి, విలేజ్ అగ్రికల్చరల్ అసిస్టెంట్ టి.సాయిమౌనిక, వ్యవసాయశాఖ సిబ్బంది పాల్గొన్నారు.



జీలుగ విత్తనాలు పంపిణీ చేస్తున్న జిల్లా వ్యవసాయశాఖ అధికారి విజయభారతి

పామర్రు: రైతులకు ప్రభుత్వం సబ్సిడీపై ఇస్తున్న పచ్చిరొట్ట విత్తనాలను వినియోగించుకోవాలని పామర్రు మండల వ్యవసాయసలహా మండలి అధ్యక్షులు ఆరుమళ్ల శ్రీనాథ్‌రెడ్డి అన్నారు. స్థానిక మార్కెట్ యార్డులోని రైతుభరోసా కేంద్రంలో గురువారం సబ్సిడీపై పచ్చిరొట్ట విత్తనాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఏఓ శివ నాగరాణి, రైతులు పాల్గొన్నారు.

ఉన్నత విద్యకు ప్రభుత్వ ప్రోత్సాహం



ప్రతిభ చూపిన విద్యార్థులతో ఎమ్మెల్యే డీఎన్నార్

ముదినేపల్లి రూరల్: ప్రతిభ చూపుతున్న విద్యార్థులు ఉన్నత విద్య అభ్యసించడానికి ప్రభుత్వం ప్రోత్సహిస్తున్నట్లు స్థానిక ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు (డీఎన్నార్) అన్నారు. కైకలూరు సీఐ వైవీఎల్‌నాయుడు, ఎస్సై షణ్ముఖసాయి ఆధ్వర్యాన గురువారం పదో తరగతి పరీక్షల్లో ప్రతిభ చూపిన మండలంలోని 18 మంది విద్యార్థులను స్థానిక వి కన్వెన్షన్ హాల్లో సత్కరించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ హైస్కూల్ స్థాయిలో ప్రతిభ చూపే విద్యార్థుల ఉన్నత చదువులకు ముఖ్యమంత్రి జగనన్న అనేక పథకాలు ప్రవేశపెట్టారన్నారు. వీటిని వినియోగించుకుని విద్యార్థులు ఉన్నత విద్యనభ్యసించి మంచి ఉద్యోగాల్లో స్థిరపడాలని ఆకాంక్షించారు. విద్యార్థులను ప్రోత్సహించిన సీఐ, ఎస్సై అభినందనీయులని కొనియాడారు. ఈ సందర్భంగా విద్యార్థులను ప్రశంసాపత్రాలు, మొమెంటోలతో సత్కరించారు. కార్యక్రమంలో ఎంపీపీ రామిశెట్టి సత్యనారాయణ, వైస్ ఎంపీపీ రాచూరి రాధ, వైఎస్సార్ సీపీ నేతలు మోట్రు ఏసుబాబు, శొంఠి నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

సాంకేతిక విద్య కోర్సులకు దరఖాస్తు చేసుకోండి

గుడివాడ టౌన్: ప్రభుత్వ సాంకేతిక (ఐటీఐ) విద్య కోర్సుల్లో అడ్మిషన్లకు ఆసక్తి ఉన్నవారు దరఖాస్తు చేసుకోవాలని స్థానిక కేబీఆర్ ప్రభుత్వ ఐటీఐ ప్రిన్సిపాల్ హరిధర్మేంద్ర గురువారం ఒక ప్రకటనలో కోరారు. ఐటీఐ.ఏపీ.జీఓవీ.ఐఎన్ వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తు రిజిస్టర్ చేసుకోవచ్చని తెలిపారు. ఆన్‌లైన్ వివరాలను అప్‌లోడ్ చేసేటప్పుడు తప్పులు దొర్లకుండా చూసుకోవాలని సూచించారు. అభ్యర్థులు ఒరిజినల్ సర్టిఫికెట్లను సమీపంలోని ఐటీఐ కళాశాల ప్రిన్సిపల్ ద్వారా అప్రూవల్ చేయించుకోవాలని తెలిపారు. జూన్ 6వ తేదీ సాయంత్రం 5 గంటల వరకు ఆన్‌లైన్ దరఖాస్తులు స్వీకరిస్తారని పేర్కొన్నారు. వివరాలకు 08674-295953, 8555952320లో సంప్రందించాలని కోరారు.

ఐడీఓ కోర్సుకు..

పామర్రు(ఎలకుర్రు): గ్రామంలోని కాశీనాథుని దుర్గాంబ బుచ్చయ్య ట్రస్టు ఆధ్వర్యాన నడుపుతున్న డైట్‌కు సమానమైన డిప్లమో ఇన్ స్పెషల్ ఎడ్యుకేషన్(ఐడీవో) కోర్సులో అడ్మిషన్లను దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు నిర్వాహకులు కాశీనాథుని నాగేశ్వరరావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ట్యూషన్ ఫీజు లేదని, రెండేళ్ల కోర్సని పేర్కొన్నారు. ఇతర వివరాలకు 95008 85168, 99591 03956లో సంప్రదించాలని సూచించారు.

విద్యార్థులకు ఆటలపోటీలు

ముదినేపల్లి రూరల్: స్థానిక శాఖా గ్రంథాలయంలో నిర్వహిస్తున్న వేసవి విజ్ఞాన శిబిరంలో గురువారం విద్యార్థులకు పుస్తక పఠనం, ఆటల పోటీలు నిర్వహించారు. గ్రంథాలయాధికారి ఎం.శ్రీదేవి ఆధ్వర్యంలో క్యారమ్స్, చెస్, లూడో గేమ్స్ నిర్వహించారు. రిటైర్డ్ గ్రంథాలయాధికారి ఔ వెంకటేశ్వరరావు విద్యార్థులకు సుమతీ శతక పద్యాలు వివరించి భక్తిపాటలు నేర్పించి పుస్తక పఠనం చేయించారు. పరిసర ప్రాంతాల విద్యార్థులు పాల్గొన్నారు.

పంట కాల్వ అభివృద్ధి పనులు

మండవల్లి: అల్లినగరం గ్రామంలో పంట కాల్ల అభివృద్ధి పనులను గురువారం ఉపాధి కూలీలు నిర్వహించారు. రూ.1.20 లక్షల నిధులతో కాల్వ అభివృద్ధి పనులు చేస్తున్నట్లు ఎంటీఏ నవీన్ పేర్కొన్నారు. 69 మంది కూలీలు పనులు చేసినట్లు చెప్పారు. ఈ పనులతో ఉపాధి లభించడమేకాకుండా, రైతుల సాగునీటి సమస్యలు పరిష్కారమవుతున్నాయని తెలిపారు. పశువులకు తాగునీటి కొరత తీరుతుందని పేర్కొన్నారు. ఫీల్డ్ అసిస్టెంట్ పాల్గొన్నారు.

పేదల సొంతింటి కల సాకారమే ధ్యేయం

గుడ్లవల్లేరు: పేదల సొంతింటి కల సాకారమే సీఎం వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వ ధ్యేయమని హౌసింగ్ డీఈ రామోజీ నాయక్ అన్నారు. పెంజెంద్రలోని జగనన్న గృహ నిర్మాణాలను ఆయన గురువారం పరిశీలించారు. జగనన్న కాలనీలో 168 గృహ నిర్మాణాలకు 155 నిర్మిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. టీడీపీ హయాంలో నిలిచిన 50ఇళ్లను కూడా త్వరలో నిర్మించనున్నామని వైఎస్సార్ సీపీ బూత్ కమిటీల గుడ్లవల్లేరు మండల కన్వీనర్ బలుసు జితేంద్ర తెలిపారు. కార్యక్రమంలో సర్పంచి రేమల్లి తాతబ్బాయ్, అధికారులు, లబ్ధిదారులు పాల్గొన్నారు.



ఇళ్ల నిర్మాణాలను పరిశీలిస్తున్న డీఈ రామోజీ నాయక్

యలమర్రు(పెదపారుపూడి): జగనన్న కాలనీలో ప్రభుత్వం పేదలకు ఇచ్చిన ఇళ్ల స్థలాల్లో త్వరతగతిన నిర్మాణాలు మొదలుపెట్టాలని ఇన్‌చార్జ్ ఎంపీడీవో ఎం. నాగిరెడ్డి అన్నారు. యలమర్రు సచివాలయం వద్ద గురువారం హౌసింగ్ లబ్ధిదారులకు అవగాహన సమావేశం నిర్వహించారు. ఎంపీడీఓ మాట్లాడుతూ నిర్మాణ పనులు ప్రారంభించిన వెంటనే బిల్లులు మంజూరు చేస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో హౌసింగ్ ఏఈ మల్లికార్జునరావు, వెలుగు ఏపీఎం వసంతరావు తదితరులు పాల్గొన్నారు.

వేసవి శిక్షణతో విద్యార్థుల్లో సృజన



కైకలూరు గ్రంథాలయంలో వేసవి శిక్షణ శిబిరంలో యోగా చేస్తున్న విద్యార్థులు



తోట్లవల్లూరు గ్రంథాలయంలో మాట్లాడుతున్న గ్రంథాలయ సంస్థ జిల్లా కార్యదర్శి రవికుమార్

కైకలూరు: వేసవి సెలవుల్లో గ్రంథాలయాల ద్వారా విద్యార్థులు సృజనాత్మక శక్తిని పెంపొందించుకోవాలని కైకలూరు, కలిదిండి శాఖల గ్రంథాలయాధికారులు ఆర్.రాఘవులు, జె.రమేష్‌బాబు చెప్పారు. వేసవి శిక్షణ తరగతులు గురువారానికి నాలుగో రోజుకు చేరుకున్నాయి. కైకలూరుశాఖ గ్రంథాలయంలో విద్యార్థులకు యోగ, నృత్యంపై శిక్షణ ఇచ్చారు. కలిదిండి గ్రంథాలయంలో డీవీ నరసయ్య విద్యార్థులకు కమ్యూనికేషన్ స్కిల్స్‌పై అవగాహన కల్పించారు. శిక్షణ చివరి రోజున బాలబాలికలకు బహుమతులు, ధ్రువపత్రాలు అందిస్తామని తెలిపారు.

మండవల్లి: మండవల్లి గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిబిరం గురువారం నాలుగో రోజు కొనసాగింది. పుస్తక పఠనం ద్వారా విద్యార్థుల భవిష్యత్ ఉజ్వలంగా ఉంటుందని గ్రంథాలయాధికారి పర్వీన పేర్కొన్నారు.

పామర్రు(తోట్లవల్లూరు): తోట్లవల్లూరు శాఖ గ్రంథాలయాన్ని గురువారం జిల్లా గ్రంథాలయ సంస్థ జిల్లా కార్యదర్శి వేములపల్లి రవికుమార్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. విద్యార్థులతో మాట్లాడి శిక్షణ శిబిరాన్ని ఎలా వినియోగించుకుంటున్నారో అడిగారు. శాఖ గ్రంథాలయ అధికారి బాబూరావు, విద్యార్థులు పాల్గొన్నారు.

వ్యక్తిత్వ వికాసాన్ని పెంచుకోవాలి

పామర్రు(జమీగొల్వేపల్లి): విద్యార్థులు వ్యక్తిత్వ వికాసాన్ని పెంపొందించుకోవాలని ఉపాధ్యాయురాలు పొట్లూరి రంగలక్ష్మి అన్నారు. జమీగొల్వేపల్లిలోని గ్రంథాలయంలో వేసవి శిక్షణ తరగతుల్లో భాగంగా గురువారం విద్యార్థులకు వ్యక్తిత్వ వికాసంపై అవగాహన కల్పించారు. ఆమె మాట్లాడుతూ విద్యార్థులకు చిన్ననాటి నుంచి మంచి అలవాట్లు నేర్పాలన్నారు. గ్రంథాలయ అధికారి వి.నాగసురేష్ మాట్లాడుతూ జూన్ 11 వరకు శిబిరాలు జరుగుతాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో మహిళా మండలి అధ్యక్షురాలు గుమ్మడి ఉషా దేవి, డి.పద్మావతి, గ్రంథాలయ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

8 వేల మందికి అన్నసమారాధన

పెనమలూరు: పోరంకిలో గురువారం 8 వేల మంది భక్తులకు అన్న సమారాధన కార్యక్రమం నిర్వహించారు. గ్రామంలో వేంచేసి ఉన్న శ్రీదేవి, భూదేవి సమేత చెన్నకేశవస్వామి వారి దేవస్థానంలో బ్రహ్మోత్సవాలలో భాగంగా స్వామివారి కల్యాణ మహోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులకు అన్నసమారాధన చేశారు.

కాశీవిశ్వేశ్వరస్వామి ఆలయ ప్రతిష్ఠ

భావదేవరపల్లి(నాగాయలంక): భావదేవరపల్లిలో నిర్మించిన అన్నపూర్ణాదేవి సమేత కాశీవిశ్వేశ్వరస్వామి ఆలయం ప్రతిష్ఠ కార్యక్రమాలు గురువారం వైభవంగా జరిగాయి. వివిధ పీఠాధిపతులు వాసుదేవానందగిరి స్వామీజీ, త్రిదండి అష్టాక్షరీ సంపత్ కుమార రామానుజ జీయర్ స్వామి, విజయానందగిరి స్వామీజీ, కమలానంద స్వామీజీల ఆశీస్సులతో ఉదయం 9.36 గంటలకు గణపతి, సుబ్రహ్మణ్య, ఆంజనేయ, కాలభైరవ, నవగ్రహ, జీవ ధ్వజస్తంభ సహిత అన్నపూర్ణాదేవి సమేత కాశీ విశ్వేశ్వర స్వామి వార్ల నూతన శిలా విగ్రహాల ప్రతిష్ఠ, యంత్రస్థాపన శాస్త్రోక్తంగా నిర్వహించారు. తెనాలి ప్రధాన అయ్యప్ప దేవాలయం వ్యవస్థాపకుడు దుర్గా హరి బాబుస్వామి బృందం, వేద పండితులు ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమాల్లో వ్యవస్థాపక ధర్మకర్త నిరంజనరావు, శివసత్యవతి దంపతులు పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధికి మరింత చొరవ



లింగవరంలో రోడ్డు పనులు పరిశీలిస్తున్న ఎంపీడీఓ వెంకటరమణ

గుడివాడరూరల్: గ్రామాల అభివృద్ధికి అధికారులు మరింత చొరవ చూపాలని ఎంపీడీఓ అనగాని వెంకటరమణ అన్నారు. మండలంలోని లింగవరం గ్రామాన్ని గురువారం ఆమె సందర్శించారు. గ్రామంలో జరుగుతున్న జీఎస్‌పీ రోడ్ల నిర్మాణాలను పరిశీలించారు. అంగన్‌వాడీ భవన నిర్మాణ కేంద్ర అభివృద్ధి పనులపై సూచనలు చేశారు. గ్రామంలో అందుతున్న పౌర సేవలపై ఆరా తీశారు. సచివాలయ ఉద్యోగులు, సిబ్బందికి పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గుడివాడ ఎమ్మెల్యే కొడాలి శ్రీవెంకటేశ్వరరావు(నాని) చొరవతో గ్రామంలో వివిధ అభివృద్ధి కార్యక్రమాలకు నిధులు మంజూరయ్యాయన్నారు. పనులు వేగవంతంగా జరుగుతున్నాయన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి కె.అనూల, ఇంజినీరింగ్ అసిస్టెంట్ బి.జయశంకర్, సచివాలయ ఉద్యోగులు, సిబ్బంది పాల్గొన్నారు.